# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 20 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మూడురోజులు వర్షాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి మరియు ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. తెలంగాణలో తొలగిపోయే మూడు రోజులపాటు (ఆది, సోమ, మంగళవారం) భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా 9 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్పష్టంచేసింది. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ సూచించింది. ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, వరద పరిస్థితులపై ప్రజలకు సమయానికి సమాచారం అందించాలన్న సూచనలు ఇవ్వబడ్డాయి. వరదల కారణంగా ఎలాంటి అనర్థాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. ఆదివారం, సోమవారం రోజుల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే గంటకు 40 – 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

# కుల గణన సర్వే చారిత్రాత్మకం



- సర్వే పట్ల నిపుణుల కమిటీ ప్రశంస
- ప్రభుత్వానికి 300 పేజీల నివేదిక సమర్పణ
- కులగణనపై ప్రభుత్వానికి300 పేజీల నివేదిక
- సమర్పించిన నిపుణుల కమిటీ
- సీఎం రేవంత్‌తో కమిటీ చైర్మెన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి బృందం భేటీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా చేపట్టిన సామాజిక–ఆర్థిక–విద్య–ఉద్యోగ–రాజకీయ–కుల గణన సర్వే 2024 పట్ల నిపుణుల కమిటీ ప్రశంసలు కురిపించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలోని ఇండిపెండెంట్ ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ సభ్యులు మంగళవారం 300 పేజీల నివేదికను ఎంసీహెచ్‌ఆర్డీ సమావేశంలో సమర్పించారు. కమిటీ అభిప్రాయం ప్రకారం ఈ సర్వే పూర్తిగా శాస్త్రీయంగా, విశ్వసనీయంగా నిర్వహించబడిందని, ఇది దేశానికే రోల్ మోడల్‌గా నిలవగలదని పేర్కొంది.సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సలహాదారు వేంపల్లి నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులుగా ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ శాంతా సిన్హా, జీన్ డ్రెజ్, థామస్ పికెట్టి, సుఖదేవ్ తొరాట్, హిమాన్షు, నిఖిల్ డే, భాంగ్య భూక్య, పురుషోత్తం రెడ్డి, ప్రవీణ్ చక్రవర్తి ఉన్నారు. కార్యదర్శిగా అనుదీప్ దురిశెట్టి వ్యవహరించారు.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తృత సర్వే**

2024 నవంబర్ 6 నుంచి డిసెంబర్ 25 వరకు మొత్తం 50 రోజుల పాటు తొలి విడత సర్వే నిర్వహించగా, 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో 96.9 శాతం కుటుంబాల సమాచారం సేకరించారు. రెండో విడతగా ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మిగిలిన కుటుంబాలకు అవకాశం కల్పించారు.

గణాంకాల ప్రకారం:

మొత్తం గృహాలు: 1,15,71,457

సర్వేలో పాల్గొన్న కుటుంబాలు: 1,12,36,849 (97.10%)

జనాభా: 3,55,50,759

ఎస్సీలు: 17.42% (61,91,294)

ఎస్టీలు: 10.43% (37,08,408)

బీసీలు: 56.36% (2,00,37,668)

ఇతరులు: 15.89% (56,13,389)

ఈ సర్వేను ఉపయోగించి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయం సాధనకు కార్యాచరణ రూపొందించేందుకు ప్రభుత్వం మంత్రిమండలిలో చర్చించనుంది. అవసరమైన విధానాల రూపకల్పనకు ఈ నివేదిక ఎంతో కీలకమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.



## హైకోర్టు సీజే ప్రమాణస్వీకారం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్ పాల్ కలకత్తా హైకోర్టుకు బదిలీ అయ్యారు. జస్టిస్ సింగ్ తెలంగాణ హైకోర్టుకు బదిలీ అయ్యే ముందు త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు, అధికారులు హాజరయ్యారు.

# బీజేపీలో కుమ్ములాటలు



- ఈటల - బండి మధ్య ఆధిపత్యపోరు
- 'హుజూరాబాద్' కేంద్రంగా మాటల యుద్ధం
- నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతంరెడ్డి రాజీనామా
- సోషల్‌మీడియా వేదికగా రెండు గ్రూపుల మధ్య లొల్లి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ బీజేపీలో కీలక నేతల మధ్య భిన్నాభిప్రాయాలు బహిరంగంగా కనిపిస్తున్నాయి. పార్టీలో కీలక నాయకులు ఈటెల రాజేందర్, బండి సంజయ్ మధ్య ఊహించని అంతర్గత పోరు ముదురుతోంది. దాదాపు "ఘర్షణ లేకుండా ఘర్షణ" వాతావరణం నెలకొనడంతో బీజేపీలో ఐక్యతపై కొత్తగా ప్రశ్నలు వినిపిస్తున్నాయి. . బండి గ్రూపు పోరు పడలేక నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతంరెడ్డి రాజీనామా చేయడం...ఆ నియోజకవర్గంలోని ముఖ్య నేతలంతా ఈటల ఇంటికెళ్లి తమ పరిస్థితేంటి? అని ప్రశ్నించారు. ఈసందర్భంగా అనుచరులకు నచ్చజెప్పే క్రమంలో ఈటల రాజేందర్ బండిపై ఫైర్ అయ్యారు.

ఎంపీగా ఉన్న ఈటెల రాజేందర్‌కు పార్టీలో తనకు తగిన స్థానం దక్కడం లేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా కేంద్ర మంత్రి పదవి కానీ, రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవి కానీ ఇవ్వకపోవడంపై ఆయన అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. బండి సంజయ్ తిరిగి పట్టువదలని పట్టు పెంచుతుండగా, ఈటల వర్గీకరణలో పక్కకు నెట్టివేయబడుతున్న భావన ఆయనను కలవరపెడుతోంది.

ఇటీవల హుజురాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమంలో బండి సంజయ్ అక్కడి పార్టీ గ్రూపుల గురించి మాట్లాడారు. బీజేపీలో మోడీ గ్రూప్ తప్ప మరో గ్రూప్ లేదనీ, ఈ నియోజకవర్గంలో ఇంకో వర్గం అని ఎందుకు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వాళ్లకు స్థానిక ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. దీనికి కొనసాగింపుగా సోషల్‌మీడియా వేదికగా ఈటలపై తప్పుడు ప్రచారం మొదలైంది. దీన్ని బండి అనుచరులే నడిపిస్తున్నారనే ఈటల వర్గం ఆరోపిస్తున్నది. ఈటలను నమ్ముకుంటే పదవులు రావనీ, బండి వైపు రావాల్సిందే అంటూ క్షేత్రస్థాయి నేతలకు సంకేతాలు పంపారనే చర్చా జరుగుతుంది. ఈ గోలల మధ్యే ఈటల ప్రధాన అనుచరుడు, హుజూరాబాద్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి గౌతంరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక నేతలు భారీ సంఖ్యలో ఈటల ఇంటికి వెళ్లారు. నియోజకవర్గంలో బండి గ్రూపుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పుకొచ్చారు. మిమ్మల్ని నమ్ముకున్నామనీ, ఇప్పుడు మా పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.

ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్ కేంద్రమంత్రి బండి సంజయ్ పేరు ప్రస్తావించకుండా, పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజలు కులం, మతం, వర్గం ఎప్పుడూ చూడరనీ, మంచోళ్లా కాదా అని మాత్రమే చూస్తారని అన్నారు. చాలామంది సీఎంలతో తానుకొట్లాడాననీ, వీళ్లెంత? చెప్పుకొచ్చారు. ఎవడెవడు సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారో..

మిగితా 2వ పేజీలో

# సబ్-కమిటీ సమావేశం



- కాలుష్య పరిశ్రమల తొలగింపు, గృహాలపై ప్రాధాన్యత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆదాయ వనరుల సమీకరణపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం జరిగిన క్యాబినెట్ సబ్–కమిటీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజల ఆరోగ్య భద్రత, ఆర్థిక వృద్ధికి దోహదపడే అంశాలపై లోతుగా చర్చించారు.

ఔటర్ రింగ్ రోడ్ లోపల కొనసాగుతున్న కాలుష్య కారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించేందుకు విధివిధానాలు, కాలపట్టిక తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, పర్యావరణ సమతుల్యతను కాపాడడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. హౌసింగ్ బోర్డు నిర్మించే ఇళ్ల అమ్మకం సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గృహ నిర్మాణ రంగంలో పారదర్శకత పెంచి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి కలను నెరవేర్చే విధంగా ప్రభుత్వ వ్యూహం ఉండాలని భట్టి పేర్కొన్నారు.

రాష్ట్ర ఆదాయ వనరులపై సమీక్ష జరిగింది. ముఖ్యంగా కమర్షియల్ టాక్స్, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్, గనుల శాఖల ఆదాయాల్లో నమోదైన వృద్ధిని విశ్లేషించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల సమీకరణ కోసం ఈ వనరులను మరింతగా విస్తరించాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ సబ్–కమిటీ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థిక బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి గట్టి పునాది వేసేలా ఈ సమావేశం దిశానిర్దేశం చేసిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.



## రాబోయే పదేళ్లు ముఖ్యమంత్రి అని ఎలా ప్రకటించుకుంటారు

- ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాగర్ కర్నూల్ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించిన విషయం తెలిసిందే. కొల్లాపూర్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ 2034 వరకు నేనె సీఎంగా ఉంటానంటూ సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. రేవంత్ రెడ్డి ప్రకటన కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం అంటూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. రాబోయే పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్ ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ సహించరు అన్నారు.

# నేడే లాల్ దర్వాజ బోనాలు

- తరలిరానున్న లక్షలాది భక్తులు
- ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- పోలీసుల పటిష్ట బందోబస్తు
- రెండు రోజులు వైన్ షాపులు బంద్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రతిష్టాత్మకంగా నిర్వహించే లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాలు ఆదివారం నగరంలో భక్తిశ్రద్ధలతో ప్రారంభం కానున్నాయి. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి బోనాల అనంతరం, నాలుగో ఆదివారంగా జరిగే లాల్‌దర్వాజ బోనాల కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. లక్షలాది భక్తులు తరలిరావడంతో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.లాల్‌దర్వాజ నుంచి చార్మినార్ మీదుగా ఢిల్లీ దర్వాజ వరకు సోమవారం ఘనంగా ఘటాల ఊరేగింపు నిర్వహించనున్నారు. పోతరాజులు, రంగం, శాంతి కల్యాణం కార్యక్రమాలతో ఈ వేడుకలు వైభవంగా సాగనున్నాయి. దేవి మహాభిషేకం, బోనాల సమర్పణ ఆదివారం జరగనున్నాయి.

"అమ్మవారి బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాం," అని ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతి యాదవ్ తెలిపారు. "తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లాల్‌దర్వాజ బోనాలను పదకొండు సంవత్సరాలుగా ఢిల్లీలో కూడా నిర్వహిస్తున్నాం," అని ఆలయ కమిటీ కన్వీనర్ జి.అరవింద్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. "పది లక్షల వరకు భక్తులు దర్శనానికి రావచ్చు. శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకునేందుకు భక్తులే ముందుకు రావాలి," అని మాజీ చైర్మన్ కె.వెంకటేశ్ అన్నారు. ఈ బోనాల ఉత్సవంతో నగరమంతా పండుగ వాతావరణంలో తేలిపోనుంది.

**ట్రాఫిక్ ఆంక్షలు, భద్రత కట్టుదిట్టం**

లాల్‌దర్వాజ, చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక ట్రాఫిక్ ఆంక్షలు, రూట్ మాపింగులు అమలులోకి తీసుకువచ్చారు. సీసీటీవీ పర్యవేక్షణతో పాటు పోలీసు, శాంతి బలగాలను భారీగా మోహరించారు.

ఇంజన్ బౌలి, ఫలక్ నుమా నుంచి అలియాబాద్ వైపు వచ్చే వాహనాలను న్యూ షంషేర్ గంజ్ వద్ద నుంచి గోశాల, మిస్రీగంజ్ వైపు మళ్లిస్తారు.

మహబూబ్ నగర్ క్రాస్ రోడ్డు నుంచి అలియాబాద్ వైపు వచ్చే వాహనాలు ఇంజన్ బౌలి నుంచి జహనుమా, గోశాల వైపు మళ్లించబడతాయి.

నాగులచింత, సుధాటాకీస్ వైపు నుంచి లాల్ దర్వాజాకు వెళ్లే వాహనాలను గౌలిపురా వైపు మళ్లిస్తారు.

చార్మినార్ నుంచి నల్లచింత వైపు వచ్చే వాహనాలను హరిబౌలి, ఓల్గా హొటల్ వైపు మళ్లిస్తారు.

వీటితో పాటు, మరికొన్ని ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ మార్గాల్లో తాత్కాలిక మార్పులు ఉంటాయని జోయల్ డేవిస్ పేర్కొన్నారు.

**రెండు రోజుల పాటు వైన్ షాపులు బంద్**

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో జరిగే శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా వైన్ షాపులు, బార్లను 20, 21న మూసివేయాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జూలై 20న ఉదయం 6 గంటల నుంచి జూలై 22 ఉదయం 6 గంటల వరకు తెలంగాణలో మద్యం విక్రయాలను నిలిపివేశారు

## డిసెంబరులో కాజీపేట మెగాకోచ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి



- 2026లో కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభం
- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హనుమకొండ జిల్లాలో నిర్మిస్తున్న కాజీపేట మెగాకోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు డిసెంబరు నాటికి పూర్తవుతాయని, 2026లో కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. కాజీపేటలో శనివారం జరిగిన తన పర్యటనలో ఆయన మాట్లాడుతూ.. "త్వరలో కాజీపేట నుండి 150 లోకోమోటివ్‌లను ఎగుమతి చేయనున్నాం," అని తెలిపారు.

**750 కోట్లతో దేశంలోనే అతిపెద్ద రైల్వే యూనిట్**

శంకర్పల్లి రైల్వే స్టేషన్ నుండి కాజీపేట వరకు రైలు మార్గంలో ప్రయాణించి, అనంతరం ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రూ. 750 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ యూనిట్ దేశంలోనే అతిపెద్ద రైల్వే మానుఫాక్చరింగ్ కేంద్రంగా రూపుదిద్దుకుంటోందన్నారు. "ఇక్కడ వందే భారత్ బోగీలు కూడా తయారవుతాయి. ఈ ప్రాజెక్టుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయి," అని వివరించారు.

**తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం కట్టుబాటు**

"ప్రధాని మోదీ నాయకత్వంలో రైల్వే రంగం వేగంగా అభివృద్ధి చెందుతుంది. తెలంగాణలో రైల్వే విస్తరణపై కేంద్రం పూర్తిగా కట్టుబడి ఉంది," అని మంత్రి తెలిపారు.

**ప్రజల కలను సాకారం చేశాం : కిషన్ రెడ్డి**

కాజీపేట మానుఫ్యాక్చరింగ్ యూనిట్ తెలంగాణ ప్రజల పాతకల అని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. "ఇక్కడి ప్రజల ఆకాంక్ష నెరవేర్చాం. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. మోదీ చేస్తున్న అభివృద్ధిని

మిగితా 2వ పేజీలో



## మేడారం ఆలయ ఆవరణలోనే ఆధునీకరణ పనులు

- గద్దెల్లో మార్పుల్లేవు
- మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ ఆధునీకరణపై సమీక్షలో మంత్రి డాక్టర్ సీతక్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా మేడారంలో ఆధునీకరణ పనులు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. భక్తుల అవసరాలకు పెద్దపీట వేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో పూజారుల అభిప్రాయాలు తీసుకుంటామని హామీనిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివాసీ సాంప్రదాయాలకు, పోరాటానికి, త్యాగానికి ప్రతీకగా నిలిచిన మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణ ఆధునీకరణపై మంత్రి సీతక్క సమీక్షించారు. భక్తుల సౌకర్యాల కోసం, ఆలయ పరిసరాల అభివృద్ధి కోసం చేపట్టబోయే మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. ఆధునీకరణ పనుల ప్రణాళికపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగా, మంత్రి సీతక్క పలు మార్పులను సూచించారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల్లో మార్పుల్లేకుండా ఆలయ ఆవరణలో చేపట్టాల్సిన ఆధునీకరణ పనులపై పలు సూచనలు చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ..పూజారుల విశ్రాంతి గదులు, అత్యవసర వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, మీడియా ప్రతినిధులకు అవసరమైన వసతుల కల్పనకు సంబంధించి స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. జంపన్న వాగు అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరయ్యాయనీ, భక్తుల సౌలభ్యం కోసం ఘాట్లను నిర్మిస్తామని తెలిపారు.

మిగితా 2వ పేజీలో

# రెండో రోజూ వదలని వాన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో రెండు రోజూ శనివారం వర్షం కురిసింది. ఎల్బీనగర్, నాగోల్, ఉప్పల్, ఉస్మానియా యూనివర్సిటీ, విద్యానగర్, నల్లకుంట ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వాన కురిసింది. మరోవైపు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మారెడుపల్లి, చిలకలగూడ ప్రాంతంలోనూ వర్షం పడింది. ఉప్పల్, తార్నాక, సీతాఫల్‌మండి, చిలకలగూడ, సికింద్రాబాద్, మారేడుపల్లి, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్‌లో కుండపోత వర్షం కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయం అయ్యాయి. రోడ్లపై వరద నీరు చేరడంతో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జవహర్‌నగర్‌లో భారీ వరద ప్రవహించింది. శ్రీ వెంకటేశ్వర కాలనీని వరద నీరు ముంచెత్తింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటికి రాలేక ఇబ్బందులు పడ్డారు.

హైదరాబాద్‌లో కురుస్తున్న

మిగితా 2వ పేజీలో



## సీపీఐ నాయకుడి హత్య కేసులో ఐదుగురు అరెస్టు

**బలగం టీవీ, హైదరాబాద్**

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కేతావత్ చందు రాథోడ్ హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసుల అరెస్టు చేశారు. ఈ నెల 15న మలక్‌పేట్ శాలివాహననగర్‌లో జీహెచ్ఎంసీ పార్క్ వద్ద ఉదయం వాకింగ్‌కు వెళ్లిన చందును గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిచంపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను పోలీసులు గుర్తించారు. వారిలో ఐదుగురిని సౌత్‌ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుల పరస్పర విభేదాలు, ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత సంఘర్షణలు హత్యకు దారితీసినట్టు విచారణలో వెల్లడైంది. శనివారం సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సీపీఐ (ఎంఎల్) నాయకుడు దొంతి రాజేష్, ప్రజా ప్రతిఘటన పార్టీ డిప్యూటీ కమాండర్ శ్రీను, కందుకూరి ప్రశాంత్, అర్జున్, లింగిమేడి రాంబాబులను అరెస్టు చేశారు. కుంభ యేడుకొండలు అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఇక 2022 హైదరాబాద్ హాయత్ నగర్ కుంట్లూరు ప్రాంతంలో దాదాపు 100 ఎకరాల్లో 1300 గుడిసెలను కేతావత్ చందు రాథోడ్ వేయించారు. మొత్తం 8 వేల మంది ఇప్పుడు ఆ గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. ఈ గుడిసెల వ్యవహరలో రాజేష్ రూ.13 లక్షలు వసూలు చేసి చందుకు ఇచ్చాడు. అయితే వాటిని తనకు ఇవ్వలేదని చందు బుకాయించాడు. దాంతో పార్టీ ముందు పరువు పోయిందని రాజేష్ భావించాడు. అలాగే బిల్డర్ బాల్‌రెడ్డితో రూ.12 లక్షల వ్యవహారంలో చందు, రాజేష్ మధ్య గొడవ జరిగింది. దాంతో పాటు తన వివాహేతర సంబంధానికి సంబంధించిన విషయంలో పార్టీకి చందు ఫిర్యాదులు చేయిస్తున్నాడని రాజేష్ పగను పెంచుకున్నాడు. అలాగే తనకు రూ.50 లక్షల ఆర్థిక నష్టం చందు వల్లే సంభవించిందని, తన ప్రాణాలకు కూడా ముప్పు ఉందని రాజేష్ భావించి ఈ హత్య చేయాలని పథకం వేశాడు.

రాజేష్ తన ఐదుగురు అనుచరులతో ముందస్తుగా కొబ్బరి బొండం కత్తులు, తుపాకులను సమకూర్చుకున్నాడు. ఓ కారును అద్దెకు తీసుకుని ఈ నెల 15న ఉదయం 6 గంటలకు చందు ఇంటి వద్ద కాపు కాశారు. అయితే అక్కడ అవకాశం దొరకలేదు. దాంతో మలక్ పేట్ శాలివాహననగర్‌లోని పార్క్‌ను స్పాట్‌గా చేసుకున్నారు. చందు రాథోడ్ పార్క్ నుంచి బయటికి రాగానే ముందుగా కందుల ప్రశాంత్ అతని కండ్లల్లో కారం పౌడర్ ను చల్లాడు. అర్జున జ్ఞాణాన ప్రకాష్ పిస్తల్, రివాల్వర్‌తో కాల్పులు జరిపాడు. దాంతో చందు అక్కడికక్కడే మృతి చెందాడు. కాల్పుల నుంచి అతను తప్పించుకుంటే కత్తులతో చంపేందుకు రాంబాబు సిద్ధంగా ఉన్నాడు. అయితే చందు కాల్పులతోనే చనిపోవడంతో నిందితులు అక్కడి నుంచి పారిపో యారు. 7 రౌండ్ల కాల్పుల్లో 3 బుల్లెట్లు చందు శరీరంలోకి ప్రవేశించాయి. . సంఘటన స్థలంలో రెండు బుల్లెట్లు, ఇతర ఆధారాలు దొరికాయి. ఈ కేసులో దర్యాప్తు ప్రారంభించి ఏపీ కావలి, జనగాంలో నిందితులను అరెస్టు చేసినట్టు సౌత్‌ఈస్ట్‌జోన్ డీసీపీ చైతన్య కుమార్ తెలిపారు.ముఠాలోని కొంత మందిపై దోపీడీ, చోరీ కేసులు కూడా ఉన్నట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఏపీ విశాఖపట్నంలో ఓ ఇంట్లో భారీగా బంగారం, నగదు దోచిన కేసులో కేసులు నమోదైనట్టు తెలిపారు. ఈ కేసు ఛేదనలో కీలకపాత్ర పోషించిన టాస్క్ ఫోర్స్, సౌత్‌ఈస్ట్‌జోన్ పోలీసులు, మలక్‌పేట్ డివిజన్ సిబ్బంది 25 మందికి రివార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ కె శ్రీకాంత్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీలు కె సుబ్బా రామిరెడ్డి, వెంకట్ రెడ్డి, సీఐలు చంద్రమోహన్, పి నరేష్, డీఐ జయశంకర్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో కుమ్ములాటలు

(మొదటి పేజీ తరువాయి)

ఏమేం రెచ్చగొడుతున్నారో అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాననీ చెప్పారు. "హుజురాబాద్ గడ్డ మీద నా వార్డు మెంబరుంటాడు..సర్పంచి ఉంటాడు.. ఎంపీటీసీ ఉంటాడు...ప్రజల కోసం నిలబడ్డోళ్లం మనం. ప్రజల మీద సంపూర్ణ విశ్వాసం ఉంది. నాకున్న లోకల్ బాడీ ఎన్నికలు హుజురాబాదే" అంటూ బండితో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమనే సంకేతాలు పంపారు. అలాగే ఇటీవలి హుజూరాబాద్ లో జరిగిన ఓ అంతర్గత సమావేశంలో ఈటెల తన అనుచరులతో మాట్లాడారు. పార్టీకి తాను చేసిన సేవల్ని గుర్తుచేస్తూ.. "నాకొస్తే ఎవరూ లేరు, నేడు కేడర్ ఉందంటే అది నా శ్రమ వల్లే" అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హుజూరాబాద్‌లో పార్టీకి వచ్చిన మెజారిటీ ఓట్లపై హర్షం వ్యక్తం చేశారు. ఈటెల చేసిన వ్యాఖ్యల్లో వ్యక్తిగతంగా ఎవరి పేరు లేకపోయినా, అవి బండి సంజయ్‌ను ఉద్దేశించి చేసినవేనన్న అర్థం పార్టీ వర్గాల్లో వస్తోంది. స్నేహంగా కనిపిస్తూ ముసుగుతో కుట్రలు చేసేవారిపై ఘాటుగా విమర్శించడం వెనుక ఆయనకు ఉన్న అసంతృప్తి స్పష్టమవుతోంది.

ఈ వ్యాఖ్యలపై బండి వర్గం స్పందించకుండా మౌనం పాటించడమే మంచి వ్యూహమని భావిస్తున్నట్లు సమాచారం. ఈటెల వ్యాఖ్యలు స్వయంగా ఆయనను నష్టపెట్టేలా మారతాయని బండి నమ్ముతున్నట్లు తెలిసింది. పైగా, పార్టీపై నమ్మకాన్ని కలిగించేలా వ్యవహరించడమే తనకు శ్రేయస్కరం అన్న భావన బండి వర్గంలో ఉంది. ఈటెల అసంతృప్తికి కారణం – పదవుల కోల్పోవడం, బండి వర్గ బలపడటం, తనను తప్పించి నిర్ణయాలు తీసుకోవడమన్న వగవలు కావొచ్చని నేతలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవికి మరో నేతను నియమించడం ఎటెలలో అసంతృప్తిని పెంచినట్లు సమాచారం. పార్టీలో తన స్థానం పటిష్టం చేసుకోవాలన్న ఈటెల ప్రయత్నం బలంగా ఉన్నా, ఇలాగే భావోద్వేగంతో సాగితే కేంద్రానికి అనుకూలంగా ఉండకపోవచ్చన్న అభిప్రాయం పలువురు నేతల్లో ఉంది. దీనివల్ల ఎటెల మరింత ఒంటరయ్యే పరిస్థితి ఏర్పడే అవకాశముంది.

మొత్తానికి... బీజేపీలో వర్గ పోరు ముదిరితే పార్టీ శ్రేణుల్లో అయోమయం, ప్రజల్లో అసమర్థత సంకేతాలు పంపించే ప్రమాదం ఉంది. ఈ భిన్న స్వరాలు నియంత్రణ లేకుండా కొనసాగితే, వచ్చే ఎన్నికల దృష్ట్యా పార్టీకి కష్టకాలమే దరిచేరినట్టే.

# ఏడాదిగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం

- **హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్**
- **రవీంద్రభారతిలో ఘనంగా హైడ్రా వార్షికోత్సవం**



**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రకృతి పరిరక్షణను మహాయజ్ఞంలా చేపట్టామని, రాజధానిని ముంపు నుంచి కాపాడి మంచి భవిష్యత్‌ను అందించడమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తోందని కమిషనర్ ఏవి.రంగనాథ్ తెలిపారు. హైడ్రా రాకతోనే కబ్జాలకు గురైన చెరువులను రక్షించుకోగలిగామన్నారు. హైడ్రా ఏర్పడి జూన్ 19తో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం హైదరాబాద్ రవీంద్రాభారతిలో 'ఇండ్ ఫేమ్ విజువల్ ఆర్ట్స్' ఆధ్వర్యంలో 'సామాజిక, పర్యావరణ అంశాలపై' వివిధ పాఠశాలల చెందిన విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను హైడ్రా కమిషనర్ రంగనాథ్ తిలకించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకలలో కమిషనర్ ప్రసంగించారు. కబ్జాదారుల చెర నుంచి కాపాడిన చెరువులను పునరుద్ధరణ, పచ్చదనం, సుందరీకరణతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో ఎన్నో సవాళ్లను సైతం ఎదుర్కొని విజయం సాధిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఏడాదిలో 500 ఎకరాల భూములను ఆక్రమణల చెర నుంచి విడిపించామని, వాటి విలువ మార్కెట్‌లో రూ.30వేల కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఆరు చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, 75 ఎకరాల్లో పూడికను తొలగిస్తే 30కోట్ల లీటర్ల వరద నీటిని నిల్వచేసే వీలుంటున్నారు. ఈ ప్రయాణంలో అనేక ఆటంకాలు ఎదురౌతున్నా వెరవకుండా భవిష్యత్ తరాలకు పర్యావరణ ఫలాలు అందించేందుకు హైడ్రా అకుంఠిత దీక్షతో పని చేస్తోందన్నారు.

**ప్రకృతి సంపదను కాపాడాలనే..**

ప్రకృతి సంపదను కాపాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని కమిషనర్ తెలిపారు. గొలుసుకట్టు చెరువులను పరిరక్షించి భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను నెలకొల్పడమే కాకుండా, పోలీసు, మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ ఇలా వివిధ శాఖలకు చెందిన అధికారాలను కూడా ప్రభుత్వం కట్టపెట్టిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. ఆక్రమణల తొలగింపు చాలా కష్టతరమైనదని, కొంతమంది స్వార్థపరుల అత్యాశకు బలి కాకూడదని అన్నారు. హైడ్రా చర్యల వల్ల చిన్న పిల్లల్లో కూడా చెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్ ఇలా అన్ని అంశాలపై అవగాహన కలిగిందన్నారు. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలో కూడా హైడ్రా గురించి అభ్యర్థులను ప్రశ్నించారని గుర్తు చేశారు. హైడ్రా వంటి సంస్థ దేశవ్యాప్తంగా ఉన్నప్పుడే ప్రకృతిని కాపాడుకోగలమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రత్యేకంగా ఒక కథనాన్ని ప్రచురించిందన్నారు. హైడ్రా వార్షికోత్సవంలో పాల్గొనడం చాలా గర్వంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీ దర్శకుడు తరుణ్ భాస్కర్ అన్నారు.

## మేడారం ఆలయ ఆవరణలోనే ఆధునీకరణ పనులు

(మొదటి పేజీ తరువాయి)

వారం రోజుల్లో గద్దెల చుట్టూ ఆధునీకరణ పనులకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేసి, పూజారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. భక్తుల కోసం మరిన్ని వసతులు కల్పించేందుకు కుంభమేళా లాంటి పెద్ద ఉత్సవాలలో వసతులు కల్పించిన ఏజెన్సీలను సంప్రదించి వారి సలహాలు తీసుకుని ముందుకెళ్తామన్నారు. మేడారానికి వెళ్లే అన్ని మార్గాల్లో ఆదివాసీ పోరాట యోధుల విగ్రహాలు, చిహ్నాలను ప్రతిష్టిస్తామన్నారు. వచ్చే మేడారం జాతర లోపు పూర్తి చేయాల్సిన పనులపై మొదట దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖ డైరెక్టర్ జి. సజన, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, ఎన్‌పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా, మిషన్ భగీరథ ఎన్‌సీ కృపాకర్ రెడ్డి, గిరిజన సాంస్కృతిక శాఖ అధికారులు, సమ్మక్క సారలమ్మ జాతర పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబరులో కాజీపేట మెగాకోచ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు స్వయంగా చూడాలి. మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు భూములు త్వరగా అప్పగిస్తే, విమాన సేవలు త్వరగా ప్రారంభమవుతాయి," అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజూ వదలని వాన

(మొదటి పేజీ తరువాయి)




జడివానకు స్థానికులు భయాందోళనకు గురువుతున్నారు. శుక్రవారం మాదిరి నగరంలోని పలు ప్రాంతాలు నీట మునుగుతాయా..? అని ఆందోళన చెందుతున్నారు. ప్యాట్నీ సెంటర్, పైగా కాలనీ, ఉప్పల్, బయో డైవర్సిటీతో పాటు పలు ఏరియాలు నీట మునిగి అటు వాహనదారులు, ఇటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. శనివారం కూడా అలాంటి పరిస్థితి తలెత్తుతే ఏంటని భయపడిపోతున్నారు.

నగరం నలువైపులా భారీ వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నివాసాలకే పరిమితం కావాలనీ, నివాసాల్లో ఉండే వారు అత్యవసరమైతేనే బయటకు రావాలని అధికారులు సూచించారు. నగరంలోని పలు ఏరియాల్లో 50 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. కగా సికింద్రాబాద్, జీడిమెట్ల, గాజులరామారం, కుత్బుల్లాపూర్, నిజాంపేట, మియాపూర్, లింగంపల్లి, బాచుపల్లి, హఫీజ్‌పేట్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, వనస్థలిపురం, సికింద్రాబాద్, ఈసీఐఎల్, కాప్రా, మల్కాజిగిరి, నేరెడ్‌మెట్, మౌలాలి, బేగంపేట్, ఉప్పల్, తార్నాక, ముషీరాబాద్, చిక్కడపల్లి, ప్యాట్నీ, ఖైరతాబాద్, లక్డీకాపూల్, కోఠి, మోహిదీపట్నం, లంగర్‌హౌజ్, రాజేంద్రనగర్ ఏరియాల్లో వాన దంచికొట్టింది.

తీవ్ర వర్షం కారణంగా హైదరాబాద్ నగరంలోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆఫీసు నుంచి ఇండ్లకు వెళ్లే సమయం కావడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రానున్న రెండు గంటల్లో నగరంలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసే అవకాశముందని జీహెచ్ఎంసీ పేర్కొంది. వర్షాల కారణంగా ఏమైన సమస్యలు తలెత్తితే వెంటనే 040-29555500, 9000113667 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలని జీహెచ్ఎంసీ సూచించింది.



# నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలి

**-ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అధికారులందరూ కృషి చేయాలని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు.శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష  పై ఎస్పీ మహేష్ బి. గితే సమీక్షా సమావేశం నిర్వహించినారు. ఈసందర్భంగా ఎస్పీ  మహేష్ బి. గితే మాట్లాడుతూ ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తుని చేపట్టి నేరస్తులకు శిక్షపడే విధంగా కృషి  చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని,కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని పోలీస్ అధికారులంతా బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని,ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితులపై,తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై  పకడ్బందీగా అమలు చేయాలనలన్నారు. త్వరలో లోకల్ బాడీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందును అధికారులు,సిబ్బంది సన్నద్ధంగా ఉండాలి పకడ్బందిగా పని చేయాలని,గ్రామాలలో జరిగే శాంతి భద్రతల అంశాలను ముందస్తు సంచారం సేకరించి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని  అన్నారు.విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ అధికారులు,సిబ్బంది ఎల్లప్పుడూ రద్దీగాల ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్ళ వద్ద గస్తీ కస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అన్నారు.

గంజాయి వంటి మత్తు పదార్థాలు,మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని,గంజాయిని రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్) వాటి నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

**పోలీస్ వాహనాల నిర్వహణ పై జాగ్రత్తలు పాటించాలి.**

జిల్లా మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు తలెత్తుతున్న సమస్యలకు తక్షణమే స్పందించి సత్వర సేవలందించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ నుండి కేటాయించబడిన పెట్రోకార్,బొలెరో  వాహనాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలనిఅన్నారు.జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన పెట్రోకార్, బొలెరో వాహనాలను తనిఖీ చేసి వాటి నిర్వహణ పరిస్థితిపై సమగ్ర సమాచారం తెలుసుకొని,వాహనాలు ఎల్లప్పుడూ కండిషన్ లో ఉండేలా చూసుకోవడం ద్వారా అనుకోని సంఘటనలు జరిగిన సందర్భాల్లో తక్షణమే స్పందించి సకాలంలో ఘటనా స్థలానికి చేరుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,సిఐ లు మొగిలి, శ్రీనివాస్,వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు,మధుకర్, నాగేశ్వరరావు, నటేష్,ఆర్ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్ఐ లు ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



# సిరిసిల్ల పద్మశాలి సంఘంలో విభేదాలు

## కొత్త అడహాక్ కమిటీ ఏర్పాటు..

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల పద్మశాలి సంఘం ఎన్నికల ప్రక్రియపై అసంతృప్తి చెలరేగింది. కొందరు పెద్ద మనుషులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంఘం నిబంధనలకు విరుద్ధంగా, నామినేషన్ల ఫీజును అసాధారణంగా పెంచారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇది తెలంగాణ రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా ఉందని, సాధారణ సభ్యులు ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకునే దురుద్దేశంతోనే ఈ చర్యకు పాల్పడ్డారని సభ్యులు మండిపడుతున్నారు. ఈ విధానాన్ని మార్చుకోవాలని సూచించినా, సంఘం "పెద్దలు" తమకు నచ్చిన విధంగానే ఎన్నికలకు వెళ్తామని, ఫీజు తగ్గించడం కుదరదని కరాకండిగా చెప్పడంతో వారి అహంకార ధోరణి స్పష్టమైందని పలువురు పద్మశాలి సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్య పద్మశాలి వర్గానికి తీరని అగాధాన్ని మిగిల్చిందని, కుల ఔన్నత్యాన్ని దెబ్బతీసిందని, కుల బాంధవులను అవమానించడమేనని వారు అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో, సిరిసిల్ల పట్టణంలో పద్మశాలి కుల ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని, ఐకమత్యాన్ని చాటే విధంగా మరొక సంఘాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని పద్మశాలి సభ్యులు నిర్ణయించారు. దీనికి అనుగుణంగా ఒక అడహాక్ కమిటీని ప్రకటించారు. కన్వీనర్ కుసుమ విష్ణు ప్రసాద్, కో-కన్వీనర్ రిక్కమల్లె మనోజ్ కుమార్, సభ్యులు చిమ్మని ప్రకాష్, కొండ ప్రతాప్, గుడ్ల విష్ణు, గుజ్జె శివరామ్, ఏలూరు చంద్రకాంత్, గాజర్ల సమ్మయ్య, రాపెల్లి రమేష్, తడుక భాను, వెంగళ రవి, వెంగళ వెంకటేశం, అడ్వైజర్ సంగీతం సత్యసాయిరాం లను కొత్త అడహాక్ మిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది

# ఆయిల్ ఫామ్ గెలల తొలికోత ప్రారంభించిన ఎమ్మెల్యే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం బోయినపల్లి మండలం మర్లపేట గ్రామంలో నిర్వహించిన ఆయిల్ ఫామ్తొలికోత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ తొలికోత కొనుగోలు కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఆయిల్ పామ్ సాగుపై రైతుల ఆదరణ పెరుగుతోందన్నారు. ఆయిల్ పామ్ పంటను తానే స్వయంగా సాగు చేస్తానని ప్రకటించిన శాసనసభ్యులు, రైతులకు నేరుగా ఆయిల్ పామ్ కొనుగోలు ఒప్పంద పత్రాలను అందజేశారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ఉద్యాన



శాఖ డిప్యూటీ డైరెక్టర్ టి. శేఖర్, జిల్లా ఉద్యాన అధికారి లత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తాసిల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి ప్రణీత, ఉద్యాన శాఖ అధికారులు లోకేష్, గోవర్ధన్, ఏఈఓ రజిత, పంచాయతీ సెక్రటరీ, ప్రియునిక్ కంపెనీ జీఎం మల్లేశ్వరరావు, జోనల్ మేనేజర్ రోహిత్, జిల్లా మేనేజర్ ప్రేమ్ సాయి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ నిధుల నుండి బోరు మంజూరు..



## బీజేపీ మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్

**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో బోరు వేయడం జరిగింది. అర్బన్ మండలంలోని రుద్రవరం మారుపాక,గుర్రంవారిపల్లి గ్రామాలకు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులనిధుల నుండి బోర్లు మంజూరు కావడం జరిగింది.దీనికి సహకరించిన జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ డా. చెన్నమనేని వికాస్ లకు గ్రామాల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. రానున్న రోజులలో వేములవాడ అర్బన్ మండలానికి కేంద్రమంత్రి సహకారంతో అన్ని గ్రామాలకు పెద్ద ఎత్తున నేరుగా ఢిల్లీ నుండి గల్లీకి నిధులు మంజూరు కావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ చింతపల్లి వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి నర్సింగోజు శంకర్, మండల ఉపాధ్యక్షులు ఎరుగొక్కుల రమేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు గోనే భాస్కర్, సీనియర్ నాయకులు చల్లా నరసయ్య, అధికార ప్రతినిధి విశ్వనాథం, శ్రీధర్, మండల కార్యదర్శి కొలనూరి సంజీవరెడ్డి, మండల కోశాధికారి సోలంకి అరవింద్, నాయకులు పోచంపల్లి భాను, పేరంగని మల్లేశం, ముధం శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు మహేష్, గణేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వాణినికేతన్ హైస్కూల్ లో ఘనంగా బోనాల సంబరాలు

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట : మండల కేంద్రంలోని  వాణినికేతన్ హై స్కూల్లో బోనాల సంబరాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో శనివారం ఏర్పాటుచేసిన బోనాల కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థులు బోనాలు ఎత్తుకొని పాఠశాల నుండి బస్టాండ్ మీదుగా  పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను  అబ్బురపరిచాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్  తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్  శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రాజు,  రమేష్, తిరుపతి, రాజు, సుమంగళి, శోభ,




సునంద, రేఖ, కళ్యాణి, రేణుక, లావణ్య, మహాలక్ష్మి, జలజ, మౌనిక,రేణుక, శాంత, పద్మ, సునీత, శామీమా లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు



# దాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఘనంగా పోచమ్మ బోనాలు

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆషాడ మాస సందర్భంగా పోచమ్మ బోనాలను ఘనంగా చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి ఎస్ వినోద్  హాజరై మాట్లాడుతూ ఈ బోనాల పండుగ తెలంగాణ సాంస్కృతి తెలియజేస్తుంది  అని  ఆషాడ మాసంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామ దేవతకు బోనం సమర్పించడం జరుగుతుందని విద్యార్థినీ విద్యార్థులు తెలంగాణ పండుగల విశిష్టత  సంస్కృతి తెలుసుకోవాలని విద్యార్థులు బాగా  చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, మండల అభివృద్ధి అధికారి శశికళ, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ ఉపాధ్యాయులు తూముకుంట నరేందర్ రెడ్డి, శ్రీను, ఆనంద్,శ్రీనివాస్ సురేష్ దావీద్ సంజీవ్, శ్రావణ్ కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శి అంజలి, గ్రామస్తులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# ఘనంగా మెహందీ కార్యక్రమం..

**బలగం టీవీ, వేములవాడ**

విశ్వహిందూ పరిషత్, మాతృశక్తి దుర్గ వాహిని ఆధ్వర్యంలో శనివారం వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్లో సామూహిక మెహందీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పట్టణ మహిళా మణులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షురాలు రుద్రోజి స్వరూరూప ప్రారంభించారు. గోరింటాకు మహిళా మణులు అందరూ పెట్టుకొని ఆనందం వ్యక్తం చేశారు. గోరింటాకు, హిందూ సనాతన ధర్మం ప్రాముఖ్యతను విశిష్టతను వివరించారు. సామూహిక గోరింటాకు ఉత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని మహిళలు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యద్యక్షులు చేపూరి అశోక్ , జిల్లా కార్యదర్శి విద్యాసాగర్,గడప కిషోర్ రావు, నాగుల రాములు గౌడ్, గౌరీశెట్టి శ్రీనివాస్, మామిడిశెట్టి శరత్, కటకం ప్రశాంత్ అధిక సంఖ్యలో మహిళలు, యువతులు పాల్గొన్నారు.



# నేడు దాయాదుల సమరం

- ఇండియా పాకిస్తాన్ లెజెండ్స్ పోరు..
- వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో పోటీ
- ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఆదివారం మహా సమరం




**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్–పాకిస్తాన్ మధ్య మ్యాచ్ అంటే అభిమానులకు పండుగే. కాగా, పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఏర్పడ్డ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య క్రికెట్ సంబంధాలు పూర్తిగా తెగిపోయిన విషయం తెలిసిందే. అయితే క్రికెట్ అభిమానులకు మరోసారి ఉత్సాహాన్ని పంచేలా టోర్నమెంట్ ఒకటి రాబోతున్నది.

వెట్టరన్ క్రికెటర్లతో కూడిన 'వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్' రెండో సీజన్‌లో భాగంగా భారత్–పాకిస్తాన్ మధ్య పోరు జూలై 20న, ఆదివారం ఇంగ్లండ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ స్టేడియంలో జరగనుంది. ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

ఇండియా ఛాంపియన్స్ జట్టు బ్యాటింగ్ లైనప్‌లో యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడు వంటి మునుపటి స్టార్ ఆటగాళ్లు ఉన్నారు. పేస్ విభాగంలో వినయ్ కుమార్, అభిమన్యు మిథు న్, సిద్ధార్థ్ కౌల్, వరుణ్ అరుణ్‌లు ఉన్నా రు. స్పిన్ విభాగంలో హర్భజన్ సింగ్, పీయూష్ చావ్లాలు ప్రత్యర్థులను దెబ్బకొట్టేందుకు రెడీగా ఉన్నారు.

పాక్ ఛాంపియన్స్ జట్టులో షోయబ్ మాలిక్, మహ్మద్ హఫీజ్, సర్ఫరాజ్ అహ్మద్, షాహిద్ ఆఫ్రిది, షర్జీల్ ఖాన్, వాహబ్ రియాజ్, కమ్రాన్ అక్మల్ వంటి అనుభవజ్ఞులు ఉన్నారు. టీమిండియాతో పోటీలో ఎటువంటి వెనుకంజ ఉండదని స్పష్టమవుతోంది.

ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్%–%పాక్ మధ్య సంబంధాలు మరింత దూరమయ్యాయి. ఫలితంగా దాయాదుల క్రికెట్‌కు విరామం వచ్చింది. ప్రస్తుతం తటస్థ వేదికలపై మాత్రమే ఆడేందుకు ఇరుదేశాల బోర్డులు అంగీకరించడంతో ఈ మ్యాచ్ జరుగుతోంది.

**ఇండియా ఛాంపియన్స్ స్క్వాడ్:**

యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, హర్భజన్ సింగ్, సురేశ్ రైనా, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడు, పీయూష్ చావ్లా, స్టువార్ట్ బిన్నీ, వరుణ్ అరోన్, వినయ్ కుమార్, అభిమన్యు మిథున్, సిద్ధార్థ్ కౌల్, గుర్కీరత్ మాన్.

**పాకిస్థాన్ ఛాంపియన్స్ స్క్వాడ్:**

మహమ్మద్ హఫీజ్, షోయబ్ మాలిక్, సర్ఫరాజ్ అహ్మద్, షర్జీల్ ఖాన్, వాహబ్ రియాజ్, అసిఫ్ అలీ, షాహిద్ ఆఫ్రిది, కమ్రాన్ అక్మల్, అమిర్ యమిన్, సొహైల్ ఖాన్, సొహైల్ తన్వీర్.



## సెమీస్‌కు హంపి చేరువ

**బలగం టీవీ, హైదరాబాద్**

జార్జియాలో జరుగుతున్న ఫిడే మహిళల వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి విజయం పథంలో దూసుకుపోతున్నది. శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ తొలి రౌండ్ మ్యాచ్‌లో చైనా ఆటగాడు యుక్జిన్ సాంగ్ను గెలవడంతో హంపి సెమీఫైనల్‌కు ఒక్క అడుగు దూరంలో నిలిచింది. రెండో గేమ్‌ను డ్రా చేసుకున్నా సరిపోతుంది. ఆరంభం నుంచే వ్యూహాత్మకంగా పావులు కదుపుతూ ప్రత్యర్థిని ఒత్తిడికి గురిచేసిన హంపి, తెల్ల పావులతో మైదానంలో దిగింది. తనదైన మార్క్ ఆటతో యుక్జిన్‌ను తడబాటుకు గురిచేసి, 53వ ఎత్తులో మ్యాచ్‌ను ముగించింది. కీలక సమయంలో భటువును ఎరగా వేసి ప్రత్యర్థిని అద్భుతంగా బుట్టలో పడేసింది. కాగా, టీమిండియా మహిళా బృందం మాత్రం నిరాశ పరిచింది. ద్రోణవల్లి హారిక, దివ్యా దేశ్‌ముఖ్ తమ తమ గేమ్‌లను డ్రా చేసుకుని సెమీస్ ఆశలకు అడ్డుగంతులయ్యారు. చదరంగంలో భారత్ పేరు నిలబెట్టే బాధ్యతను హంపి ఒంటరిగా మోస్తున్న తీరు దేశవాసులను ఆకట్టుకుంటోంది.

## తెలుగు ప్రేక్షకులందరికీ పాదాభివందనాలు

**బలగం టీవీ, హైదరాబాద్**



పారిశ్రామికవేత్త గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా ఎంట్రీ ఇచ్చిన చిత్రం జూనియర్. వైరల్ వయ్యారి పాటతో ఫుల్ వైరల్‌గా మారిన ఈ కుర్రాడు జూనియర్‌తో నటుడిగా ఎంట్రీ ఇచ్చాడు. శ్రీలీల, జెనిలియా డిసౌజా, రవిచంద్రన్, రావురమేష్, ఆచ్యుత్ రావు తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు రాధాకృష్ణారెడ్డి దర్శకత్వం వహించగా.. సాయి శివానీ సమర్పణలో వరాహి చలన చిత్ర, సాయి కొర్రపాటి ప్రొడక్షన్ బ్యానర్లపై రజనీ కొర్రపాటి నిర్మించారు. తెలుగుతో పాటు కన్నడ భాషలో ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమాకు తెలుగులో మంచి ఆదరణ లభించడంతో తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపాడు నటుడు కిరీటి. ఈ సందర్భంగా ఓ ప్రకటన విడుదల చేశారు. తెలుగు ప్రేక్షకులందరికీ నా పాదాభివందనాలు. 'జూనియర్'కు వస్తున్న ప్రేమ, ఆదరణను చూస్తుంటే నాకు ఎంతో ఆనందంగా ఉంది. మేము ఎంతో నిజాయితీగా, హృదయపూర్వకంగా ఈ సినిమాను తీశాం. మీకు మంచి సినిమాలు అందించడానికి మేము ఎల్లప్పుడూ శ్రమిస్తూనే ఉంటాం. మీ ప్రేమ, ఆశీర్వాదం ఎప్పటికీ ఇలానే కొనసాగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను ఇట్లు మీ కిరీటి అంటూ పోస్ట్ చేశాడు.

## ఆగస్టు 1న 'సన్ ఆఫ్ సర్దార్ 2' విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




విజయ్ దేవరకొండ నటించిన 'కింగ్‌డమ్' సినిమాకి గట్టి పోటీగా బాలీవుడ్ హీరో అజయ్ దేవగణ్ 'సన్ ఆఫ్ సర్దార్ 2'తో రాబోతున్నారు. విజయ్ కుమార్ అరోరా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మృణాల్ థాకూర్ కథానాయికగా నటిస్తోంది. తెలుగు హిట్ మూవీ 'మర్యాద రామన్న' (దర్శకుడు: రాజమౌళి, హీరో: సునీల్) హిందీలో రీమేక్ అయిన చిత్రం 'సన్ ఆఫ్ సర్దార్'. ఇప్పుడు దానికి సీక్వెల్‌గా 'సన్ ఆఫ్ సర్దార్ 2' ను రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. అయితే తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడింది. జూలై 25న విడుదల కావలసిన ఈ చిత్రం, అనివార్య కారణాల వల్ల ఆగస్టు 1కు మారినట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే జులై 31న టాలీవుడ్ నుంచి విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' చిత్రం విడుదల కానుండటంతో, బాక్సాఫీస్ వద్ద హీట్ పెరిగే అవకాశం ఉంది.




## ఏపీలో 'హరి హర వీరమల్లు' టికెట్ ధరల పెంపు

**బలగం టీవీ, హైదరాబాద్**

పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన చారిత్రక చిత్రం 'హరి హర వీరమల్లు' ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. సినిమా విడుదలైన మొదటి 10 రోజుల పాటు ప్రత్యేక రేట్లు వసూలు చేయడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.

సింగిల్ స్క్రీన్ థియేటర్లలో

లోయర్ క్లాస్ టికెట్‌పై రూ. 100


అప్పర్ క్లాస్ టికెట్‌పై రూ. 150 వరకు

మల్టీప్లెక్స్ లలో టికెట్ ధరను రూ. 200 వరకు పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది.

అంతేకాదు, జూలై 23న రాత్రి ప్రీమియర్ షోలు నిర్వహించేందుకు కూడా అనుమతినిచ్చింది. ఈ ప్రీమియర్ షో టికెట్ ధరను రూ. 600 ం జీఎస్టీగా నిర్ణయించారు. ఈ సినిమాను క్రిష్, జ్యోతికృష్ణ కలిసి దర్శకత్వం వహించగా, నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. ఏఎం రత్నం నిర్మించిన ఈ చిత్రాన్ని చారిత్రక నేపథ్యం కలిగిన మేకింగ్‌తో తెరకెక్కించారు. ఇదిలా ఉంటే, తెలంగాణ రాష్ట్రంలో కూడా టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు అర్జీ పెట్టుకున్నారు. చారిత్రక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని తెలంగాణలోనూ ఇలాంటి అనుమతి రావచ్చని చిత్ర వర్గాలు ఆశిస్తున్నాయి.

## సామ్‌రాజ్యగా రాబోతున్న కింగ్‌డమ్

**బలగం టీవీ, హైదరాబాద్**




విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'కింగ్‌డమ్'. గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పాన్‌ఇండియా రేంజ్‌లో తెరకెక్కిన ఈ మూవీ జూలై 31న గ్రాండ్‌గా విడుదల కానుంది. దీంతో మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా హిందీ వెర్షన్ టైటిల్ అనౌన్స్ చేశారు. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు 'సామ్‌రాజ్య' అనే టైటిల్ ఖరారు చేసినట్లు మేకర్స్ శనివారం అనౌన్స్ చేశారు. కింగ్‌డమ్ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నది. సత్యదేవ్ కీలకపాత్రలో నటిస్తున్నాడు. అనిరుధ్ రవిచంద్ర మ్యూజిక్ అందిస్తున్నాడు.

## 30 ఏళ్ల వరకూ పెళ్లి లేదు

- శ్రీలీల

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్‌లో అతి తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "ప్రస్తుతం నా వయసు 24. మరో 6 ఏళ్ల వరకూ అంటే 30 ఏళ్లు వచ్చేంత వరకూ పెళ్లి గురించి ఆలోచన లేదు. నా ఫోకస్ మొత్తం సినిమాలపైనే ఉంది. ప్రైవేట్ లైఫ్ గురించి ఆలోచించేందుకు కూడా సమయం లేదు," అని ఆమె స్పష్టం చేసింది. తాను నిజంగా ఎవరిదైనా ప్రేమలో ఉంటే అమ్మ తనతో ఉండగలదా? అంటూ ప్రశ్నించిన శ్రీలీల, "అమెరికా వెళ్లినప్పుడు కూడా అమ్మ నాతోనే ఉంటుంది. ఇలాంటి సమయంలో ఎవరితో ప్రేమలో పడగలను?" అని చెప్పింది. ప్రస్తుతం పెద్ద సినిమాలు, స్టార్ హీరోలతో ఛాన్సులు వస్తుండటంతో... తన పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉందని, ప్రేక్షకుల అభిమానం పొందడమే తన లక్ష్యమని పేర్కొంది.

## షారుక్ ఖాన్‌కి 'కింగ్' సినిమా సెట్స్‌లో గాయం

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం 'కింగ్' షూటింగ్ సమయంలో ప్రమాదం జరిగింది. ఓ యాక్షన్ సన్నివేశం చిత్రీకరణలో డూప్ లేకుండా స్వయంగా స్టంట్ చేస్తుండగా షారుక్ గాయపడినట్లు సమాచారం. దీంతో తాత్కాలికంగా షూటింగ్ నిలిపివేశారు. గాయపడ్డ వెంటనే చికిత్స కోసం షారుక్ తన బృందంతో కలిసి అమెరికా వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే గాయంపై అధికారిక వివరాలు ఇంకా తెలియరాలేదు. తీవ్రమైన గాయం కాదని, కండరాలకు సంభంధించిన గాయమేనని షారుక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఆయన పూర్తి ఆరోగ్యంతో తిరిగొచ్చేంతవరకూ షఉటింగ్ వాయిదా వేశారని సమాచారం. సెప్టెంబర్‌లో మళ్లీ షఉటింగ్ ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో షారుక్‌తో పాటు ఆయన కుమార్తె సుహానా ఖాన్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇక రాణీ ముఖర్జీ సుహానాకు తల్లి పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ వర్గాలు వెల్లడించాయి. భారీ మోతాదులో యాక్షన్ సన్నివేశాలతో రూపొందుతున్న ఈ చిత్రం షఉటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.